ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 17 అక్టోబరు 2024



ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

పాలకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులకు మొక్కలపై 90 శాతం,డ్రిప్ ఏర్పాటుకు 80 శాతం ప్రభుత్వ రాయితీ వస్తుందని, అంతర పంటల సాగుకు రూ.4500 ఏటా ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు శశిధర్,యోజన ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందు

ఆపరేషన్లలో అనస్థీషియా వైద్యులు కీలకం..

● సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు

8



కబ్జాకు గురవుతున్న మార్కెట్ యార్డు స్థలం

వ్యవసాయ మార్కెట్ స్థలంపై కబ్జాదారుల కన్ను

● పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడమే కారణం

● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

8

న్యూస్ బాక్స్

మొగల్‌పహాడ్‌లో కార్డన్ సెర్చ్

అంతర్గాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మొగల్‌పహాడ్ గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు. ఆపద సమయంలో ప్రజలు 100 డయల్ కాల్ చేసి పోలీసుల సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు బీ వెంకటస్వామి, కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో మొదలగు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్రయ్య, వైద్యులు దీక్షిత్, ఆసుపత్రి సిబ్బంది హరీష్, శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



● ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లు

● కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

● జిల్లాలో మొదలైన ప్రక్రియ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు మార్గం సుగమం అయింది. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను నియమిం చేందుకు కసరత్తు చేస్తున్నది. పేద, మధ్య తరగతి కుటుంబాల కలలు నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం ఆ లబ్ధిదాలను ఎంపిక చేసినందుకు గ్రామ పంచాయతీల వారీగా, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేస్తారని నమ్మకం కుదిరింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ నెరవేరలేదు. ఆయా పట్టణాలు, గ్రామాల్లో చేపట్టిన ఇళ్లలో ఇప్పటికి కూడా పూర్తిగాక అర్థాంతరంగా నిలిచిపోయాయి. పెద్దపల్లి, మంథని, రామగుండం ప్రాంతంలో కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, లబ్ధిదారులను ఎంపిక చేశారు. మంథనిలో నిర్మించిన ఇళ్లకు ఎంపిక చేసిన లబ్ధిదారులు అందులో నివాసం ఉంటున్నారు. పెదపల్లి, రామగుండం ప్రాంతంలో నిర్మించిన ఇళ్లకు మౌలిక వసతులు లేకపోవడంతో వాటి పనులు కొనసాగుతున్నాయి. అలాగే కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో నిర్మించిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. బీఆర్‌ఎస్ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి స్థలం ఉన్న వారికి ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షలు, ఇతరులకు 5 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించింది. నవంబర్ నెలాఖరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు మాసాల క్రితం ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసింది.

● కమిటీల ఎంపికకు కసరత్తు..

ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం గ్రామాలు, మున్సిపల్ కార్పొరేషన్లు, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రభుత్వం ఇటీవల ఇందిరమ్మ కమిటీలను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రక్రియను జిల్లాలో కొనసాగిస్తున్నారు. జిల్లాలో 267 గ్రామపంచాయతీలు ఉండగా, 267 ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను నియమించనున్నారు. అలాగే రామగుండం కార్పొరేషన్‌లో 50 డివిజన్లు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో 114 వార్డులకు కమిటీలను ఎంపిక చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ చైర్మన్‌గా సర్పంచ్ లేదా గ్రామ ప్రత్యేక అధికారి ఉండనున్నారు. స్వశక్తి సంఘాల గ్రూపులకు చెందిన ఇద్దరు మహిళలు సభ్యులుగా ఉండనున్నారు. అలాగే మరో ముగ్గురు మహిళలు గ్రామ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే వారిని ఎంపిక చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అందులో బీసీ, ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన వారిని తప్పనిసరిగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీల్లోనూ వార్డుల వారీగా, కార్పొరేషన్‌లో డివిజన్ వారీగా కమిటీలను నియమించనున్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా ఉండనున్నారు. మిగతా సభ్యులు గ్రామపంచాయతీలో వలే ఉండనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఎంపిక ప్రక్రియ జిల్లాలో కొనసాగుతున్నదని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య పేర్కొన్నారు. ఈ కమిటీల ఎంపిక పూర్తయిన తర్వాత ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలను అనుసరించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. కమిటీల ఎంపిక వారం రోజుల్లో పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

21 నుంచి కమిషనరేట్‌లో ఫ్లాగ్ డే వారోత్సవాలు : సీపీ

కోల్‌సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 21 నుంచి 31వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీపీ ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీ సు విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసులు చేసిన ప్రతిభ, త్యాగాలు తదితర విషయాలు ప్రజలకు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కేటగిరి-1 ఇంటర్మీడియట్ వరకు 'విచక్షణతో కూడిన మొబైల్ వాడకం', కేటగిరి-2 డిగ్రీ, ఆపై విద్యార్థులకు 'తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వ్యాసరచనలను ఈనెల 24వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చునని తెలిపారు. అలాగే కానిస్టేబుల్ అధికారి నుంచి ఏఎస్‌ఐ స్థాయి అధికారి వరకు 'సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో నా పాత్ర' అనే అంశంపై, ఎస్‌ఐ స్థాయి అధికారి, ఆపై స్థాయి అధికారులకు 'దృఢమైన శరీరంలో దృఢమైన మనసు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పద్మశాలి సంఘం హడాక్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీనగర్‌లో జరగబోయే దసరా మేళా అలై బలై కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు.చైర్మన్ వలస నీలయ్య, ఆడెపు సుధాకర్, టీవీఎస్ మూర్తి, గజ్జల పురుషోత్తం, కొక్కుల మల్లన్న, రమేష్, పాలకుర్తి, చింతకింది నంబయ్య పాల్గొన్నారు.

పీజీ కోర్సుల అనుమతి సాధించే దిశగా కార్యాచరణ

● సమీక్ష సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ (సిమ్స్) కళాశాలలో పీజీ కోర్సులు ప్రారంభించేందుకు జాతీయ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతి సాధించే దిశగా పటిష్ట కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం వైద్య కళాశాలలో ఆసుపత్రి నిర్వహణ, వైద్య కళాశాలలో సీట్ల పెంపుపై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిమ్స్‌లో అన్ని రకాల సౌకర్యాలున్నాయని, ఎంబీబీఎస్ కోర్సు నడుస్తున్నదని, భవిష్యత్‌లో పీజీ కోర్సులు సైతం కళాశాలలో ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి వీలుగా జాతీయ మెడికల్ కౌన్సిల్ గైడ్‌లైన్స్ ప్రకారం కళాశాలలో చేపట్టాల్సిన మార్పులు, అనుమతులకు సంబంధించి ఏయే అడ్డంకులున్నాయి, వేటిని అధిగమించాల్సి ఉంది అనే వివరాలపై ఆరాతీశారు. ముఖ్యంగా ఫ్యాకల్టీ, క్లినికల్ మెటీరియల్, మౌలిక సదుపాయల గురించి చర్చించి సూచనలు చేశారు. పీజీ కోర్సులు సాధించే అంశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్‌లు సిమ్స్‌కు సహకారం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, గోదావరిఖని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా రాణించాలని జిల్లా మహిళ సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకల్వలలో గ్రామీణ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దయా అరుణ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని అన్నారు. సఖీ కేంద్రం, చైల్డ్ హెల్ప్ లైన్, భరోసా, షీటీం, వంటి ఎన్నో భద్రత కేంద్రాలు, చట్టాలు, హెల్ప్ లైన్ నెంబర్‌లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహిళలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనవసర మేసేజ్‌లకు రిప్లై ఇవ్వోద్దన్నారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న, ఫైనాన్స్ లిట్రసీ సేరు సంధ్యారాణిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్ అంశాలపై అవగాహన

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శ్రీసాయి వీవో మీటింగ్ సభ్యులకు బుధవారం 1098చైల్డ్‌హెల్ప్ అంశాలపై చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రేనుకుంట్ల సతీష్ అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, తప్పిపోయిన పిల్లలు, పోక్సో చట్టం, అనాథ పిల్లలు, పిల్లలపై అసభ్య ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలకు ఏమైనా సమస్య ఉంటే 1098కు వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం శాంతి, గ్రూప్ సభ్యులు ఉన్నారు.

దేశ ఆహార భద్రతలో కీలక పాత్ర

- ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స్

కోల్‌సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియాలో చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్) అని, దేశ రైతాంగానికి దన్నుగా ఉంటూ వారి అవసరాలను తీర్చుతుందని ఆర్‌ఎఫ్‌సీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ రాజ హన్స్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యలతో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో రాజ హన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి యూరియా దిగుమతిపై ఆధారపడకుండా స్వయం స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం మూతపడిన ఎరువుల కర్మాగారాల స్థానంలో కొత్త కర్మాగారాలు స్థాపించిందన్నారు. వివిధ ప్రభుత్వరంగ సంస్థలతో జాయింట్ వెంచర్‌లో ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను నెలకొల్పారన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. తెలంగాణతో పాటు కర్ణాకట, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళ నాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు యూరియా సరఫరా చేస్తున్నదని వివరించారు. దేశ పౌరులకు ఆహార భద్రత అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని వివరించారు.

నేడు తెరవే ఆధ్వర్యంలో 'కథల ముచ్చట్లు'

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కవులు, రచయితలు కథల ముచ్చట్లు సాహిత్య కార్యక్రమం పెద్దపల్లిలో జరగనున్నది. దశాబ్ద కాలంగా తెరవే నిర్వహణలో ప్రతి పౌర్ణమికి ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమం నిరంతరాయంగా కరీంనగర్‌లో కొనసాగుతోంది. ఈసారి పౌర్ణమికి కథల ముచ్చట్లు పేరుతో పెద్దపల్లిలో తెరవే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టబోతోంది. రచయితలు సింగిల్ పేజీ చిన్న కథలతో గురువారం సాయంత్రం 6.30 గంటలకు పెద్దపల్లి కలెక్టరేట్ ప్రాంగణానికి హాజరుకావాలని తెరవే బాధ్యులు జీగురు రవీందర్, జినుకల వెంకటేశ్ ఒక ప్రకటనలో కోరారు. కథల ముచ్చట్లు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ జీవి శ్యామ్ ప్రసాద్‌లాల్ తన నివాసంలో ఆతిథ్యం ఇవ్వనున్నారు. కార్యక్రమంలో సీనియర్ కథకులు కొత్తవారికి సూచనలు ఇవ్వనున్నారు.

సకాలంలో రైస్ డెలివరీ ప్రక్రియ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్



మిల్లర్లతో సమావేశమైన అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విధించిన గడువు లోగా సకాలంలో ఖరీఫ్ 2023-24, రబీ 2023-24 సీజన్‌లకు సంబంధించి పెండింగ్ రైస్ డెలివరీని తప్పనిసరిగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ జిల్లాలోని రైస్‌మిల్లర్లు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ 2023-24, రబీ సీజన్ 2023-24కు సంబంధించి బాకీ ఉన్న రైస్ డెలివరీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రా రైస్ మిల్లులు వారికి కేటాయించిన ధాన్యాన్ని ప్రాసెస్ చేసి ప్రతిరోజు వాటి సామర్థ్యం మేరకు అత్యధిక ఏసీకేలు డెలివరీ చేయాలని ఆదేశించారు. రైస్ డెలివరీ ఆలస్యం చేస్తున్న రైస్‌మిల్లులను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీచేయాలని, రైస్ మిల్లులు పూర్తిస్థాయిలో గడువులోగా రైస్ డెలివరీ పూర్తి చేయాలన్నారు. బాకీ ఉన్న రైస్ మిల్లర్లు సకాలంలో రైస్ అప్పగించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు హెచ్చరించారు. సమావేశంలో డీఎస్‌వో రాజేందర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం

- జూనియర్ సివిల్ జడ్జి గణేష్



కనుకులలో మాట్లాడుతున్న జడ్జి గణేష్

సుల్తానాబాద్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి) : మారు ప్రాంతాల ప్రజలకు సైతం ఉచిత న్యాయ సేవలు అందించేందుకు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతు చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు సమాజంలో ఆదర్శప్రాయమైన జీవిన విధానానికి మార్గం సుగమం అవుతందన్నారు. గ్రామాలలో కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు ఇతరత్రా కేసులకు సంబంధించి సుల్తానాబాద్ కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదిస్తే న్యాయ సహాయం ఉచితంగా అందిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కల్పిస్తున్న ఉచిత బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పడాల శ్రీరాములుగౌడ్, ప్రధానకార్యదర్శి జోగుల రమేష్,ఏజీపీ ఆవుల లక్ష్మీరాజంయాదవ్, లోక్‌అదాలత్ సభ్యులు ఆలూరి శ్రీనివాసరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : డీపీఎం

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని డీపీఎం తిరుపతి అన్నారు. బుధవారం ఓదెల మండల కేంద్రంలో కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలం ధాన్యం కొనుగోలు కేంద్రాల వారికి నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ధాన్యం నాణ్యత తేమ శాతం 17లోపు ఉండాలని ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, కామన్ గ్రేడ్ ధాన్యానికి రూ2300 మద్దతు ధర ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎం లతా మంగేశ్వరి, కనుకయ్య, సీసీలు శ్రీనివాస్, మల్లయ్య, కొమురయ్య, విజయ, శారద, హరికృష్ణ, నిర్మల, తిరుపతి దేవి, కనకతారలతో పాటు పలువురు పాల్గొన్నారు.


ఎండుతున్న ఆయిల్ పామ్ మొక్కలు

● ట్యాంకర్లతో నీటిని పోస్తూ కాపాడుకుంటున్నరైతులు



సిరిసిల్ల చిన్నబోనాలలో సాగుచేసిన అయిల్ పామ్ పంట

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్రిప్‌లను మంజూ రు చేయకపోవడంతో సాగు చేసిన ఆయిల్‌పామ్ మొక్కలు ఎండిపోతు న్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయిల్‌పామ్ సాగును చేయాలని గత ప్రభుత్వం తో పాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం సైతం ప్రోత్సహి స్తుండడంతో రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకొచ్చారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 212 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారు. మొక్కలను రైతులు వారివారి



నీళ్లులేక ఎండిపోయిన మొక్క

భూముల్లో సాగు చేసుకున్నారు. వాటిని నిత్యం సుమారు 40లీటర్ల నీటిని అందించాలని దానికి అవసరమైన డ్రిప్‌లను కూడా అందిస్తామని అధికారులు రైతుల నుంచి డీడీల రూపంలో డబ్బులను తీసుకున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసి 3నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ రైతుల కు డ్రిఫ్‌లు మంజురు కాలేదు. సాగుచేసిన ఆయిల్‌పామ్ మొక్కలు నీరులేక ఎండిపోతుండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామానికి చెందిన యువ రైతు దడిగెల శ్రావణ్ రావు తనకు ఉన్న 9ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేందుకు ముందు కు రాగా ఉద్యాన అధికారులు 450 మొక్కలను సరఫరా చేశారు. అ రైతు మొక్కలను నాటి మూడు నెలలు గడుస్తున్నాయి. డ్రిప్‌కోసం రూ 1.80 లక్షల డీడీ చెల్లించినా ఇంతవరకు మంజూరు చేయకపోవడంతో నీరులేక ఆ మొక్కలు ఎండిపోతున్నాయి. రైతులు ట్యాంకర్లను ఏర్పాటుచేసి కూలీలలతో వారం రోజులనుంచి ఆయిల్‌పామ్ మొక్కలకు నీటిని పోయిస్తూ కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డ్రిప్‌లను మంజూరు చేసి మొక్కలను కాపాడాలని కోరుతున్నారు.

ట్యాంకర్‌తో నీటిని పోస్తున్న



చిన్నబోనాల శివారులో 9 ఎకరాలల్లో మూడు నెలల క్రితం ఆయిల్‌పాం మొక్కలను సాగు చేశాను. డ్రిప్‌కోసం డబ్బులను చెల్లించినా ఇంతవరకు డ్రిప్ మంజూరువక పోవడంతో ట్యాంకర్లతో నీటిని పోయిస్తూ మొక్కలను కాపాడుకుంటున్నాను. అధికారులు స్పందించి మొక్కలను కాపాడానికి డ్రిప్‌లను అందించాలి.

- దడిగెల శ్రావణ్‌రావు, యువరైతు, చిన్నబోనాల

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న నందెల్లి మహిపాల్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించనున్న దక్షిణ భారత జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న ఇ విష్ణువర్ధన్ పదివేల మీటర్లు, ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పోటీల్లో, గైని నక్షత్ర ట్రయథ్లాన్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచి దక్షిణ భారత జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు నటరాజ్ రవి, హరికిషన్, రవికుమార్, రాజగోపాలాచారి, జగ్విందర్ సింగ్, బిషన్‌సింగ్ అభినందించారు.

గుండె పోటుతో చిన్నారి మృతి



శ్రీయాన్షి (ఫైల్)

జమ్మికుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి గుండె పోటుతో మృత్యువాత పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి రాజు - జమున దంపతుల కూతురు శ్రీయాన్షి(4). రాజు జమ్మికుంటలోని ఓప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ భార్యాపిల్లలతో ఇక్కడే నివాసం ఉంటున్నాడు. శ్రీయాని పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. మంగళవారం ఉదయం నిద్రలేచిన తర్వాత పాఠశాలకు వెళ్లేందకు రెడీ అవుతూ ఒక్కసారిగా కిందపడిపోయింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన హన్మకొం డలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్నారి ఊపిరితిత్తులో ఒక లేయర్ ఏర్పడిందని దాని వల్ల శ్వాస సరిగా ఆడక గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు నిర్ధారించారు.

నాడు ఒకే బావికి ఏడుమోటలు

● నేడు అదే పేరుతో ఏడుమోటలపల్లి గ్రామం ఏర్పాటు



ఏడుమోటలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పెగడపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాడు సాగు నీటి కొరతతో ఒకే బావికి ఏడుమోటలు ఏర్పాటు చేయగా నేడు అదే గ్రామంగా ఏర్పడి ఏడు మోటలపల్లి గ్రామపంచాయతీగా పిలువబడుతోంది పెగడపల్లి మండలంలోని ఓ గ్రామం. పెగడపల్లి మండల కేంద్రానికి అనుబంద గ్రామంగా ఉన్న చెర్లపల్లి (చెరువుకు అనుకుని ఉన్న ఇళ్లు) ఒకప్పుడు చెర్లపల్లిగా పిలవబడుతుండేది. కాగా 1970కి పూర్వం సాగునీటి కరువు ఉన్నపుడు చెరువు శిఖంలో వ్యవసాయ బావిలో నీరు సమృద్ధిగా ఉండటంతో ఒకే బావికి ఏడుమోటలు (అప్పట్లో ఎద్దుల సాయంతో నీటిని తోడేందుకు వ్యవసాయానికి మోటలు వాడేవారు) ఏర్పాటు చేశారు. కాగా అప్పటి నుంచి చెర్లపల్లి గ్రామమే ఏడుమోటలపల్లిగా మార్పు చెంది నేడు ఏడుమోటలపల్లి పేరుతోనే గ్రామపంచాయతీగా ఏర్పడి ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో ఒక బావి పేరుతో నేడు గ్రామం ఏర్పడి ప్రత్యేకతను సంతరించుకుంది.

ఆ ఇంట్లో అందరూ ప్రభుత్వ ఉద్యోగులే. కుటుంబంలో ఒకరు ఎక్సైజ్ శాఖలో సీఐగా పని చేస్తుండగా నలుగురు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. అందరూ ఉద్యోగులైనా ఉమ్మడిగా కలిసే ఉంటున్నారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనిపించే సంఘటనలు అరుదు. చిన్న విషయాలకే విడిపోతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అటువంటిది ఆ తోబుట్టువులంతా ఉద్యోగాలు చేస్తున్నా ఎలాంటి అహం లేకుండా ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు. ఆదాయాల గురించి ఏనాడూ ఆలోచన చేయకుండా ఒకరికొకరు సాయంగా జీవిస్తున్నారు.



తల్లి పోచవ్వతో కొడుకులు, కూతుళ్లు

ఆ ఇంట్లో అందరూ ఉద్యోగులే

- ఒకరు ఎక్సైజ్ సీఐ, నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు
- కష్టాలు ఎదురైనా లక్ష్యం దిశగా పయనం
- చదువే ఆలంబనగా.. ఉన్నత స్థాయికి
- ఉమ్మడి కుటుంబంగా ఆదర్శంగా నిలుస్తున్న తోబుట్టువులు

ఆదర్శం

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చదువే ఆలంబనగా అద్భుత విజయాలు సొంతం చేసుకున్న ఆ తోబుట్టువులు పలువురి అభినందనలు అందుకుంటున్నారు. అందరూ ఉద్యోగులైనా ఉమ్మడిగా కలిసే ఉంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన మరాఠి పోచవ్వ-రాజయ్య దంపతులకు ఐదు గురు సంతానం. వారిలో ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. వారంతా నర్మాల ప్రభుత్వ పాఠశాలలో మూడో తర గతి వరకు, గంభీరావుపేట హాస్టల్లో ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి నుంచి పదోతరగతి వరకు చదువుకున్నారు.

యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఐదుగురు సంతానంలో పెద్ద కుమారుడు మరాఠి రాజమల్లికార్జున్ ప్రభుత్వ టీచర్‌గా, రెండో కుమారుడు చంద్రశేఖర్ ఎక్సైజ్ శాఖలో సీఐగా, పెద్ద కూతురు వెంకటలక్ష్మి, రెండో కూతురు దేవలక్ష్మి, చిన్న కుమారుడు అజయ్ కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్ద వాడైన మల్లికార్జున్ స్థానిక ప్రైవేటు పాఠశాలలో నెలకు రూ.200 జీతానికి చేరి ప్రైవేటు ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ఆరంభించాడు. ఆ పాఠశాలలో తోటి ఉపాధ్యాయుల సలహాలతో ఉన్నత అభ్యాసం మొదలు పెట్టాడు. ఎంఏ, ఎంఫిల్, టీపీటీ, బీఈడీను పూర్తి చేశాడు. రెండో కుమారుడు చంద్రశేఖర్ మొదట అగ్రికల్చర్ అధికారిగా పనిచేశాడు. ఆ సమయంలో చాలా మందితో స్నేహాన్ని పెంచుకున్నాడు. గ్రూపు టూ ద్వారా ఆబ్కారీ శాఖలో ఎస్సైగా నియామకమయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సీఐగా పనిచేస్తున్నాడు. వారి మార్గంలోనే ఇద్దరు చెల్లెళ్లను తమ్ముడిని నడిపించారు.

ఆత్మీయత, అనురాగాల నిలయం

ప్రస్తుత సమాజంలో చిన్న విషయాలకు విడిపోతున్న కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నా ఆ తోబుట్టువులు ఉమ్మడిగా ఉంటున్నారు. కుటుంబంలో ఇరవై మందికి పైగా ఉంటారు. వారికి తోడు వచ్చిపోయే చుట్టాలు అదనం. అందరూ ఉద్యోగులైనా జీవితాన్ని పైసలతో కొలువక పోవడం వారి ప్రత్యేకత. ఎలాంటి గర్వం లేకుండా ఒకరికొకరు సర్దుకుపోవడం వారిలో ఉన్న గొప్ప గుణం. పిల్లల్లో వచ్చే చిన్న చిన్న మాట పట్టింపులు చూసి నవ్వుజెబుతారు.

అక్షరమే మా ఇంటిని నిలబెట్టింది..: మల్లికార్జున్, టీచర్



అక్షరమే మా ఇంటిని నిలబెట్టింది. మా అమ్మానాన్నల కష్టాన్ని వృథా చేయలేదు. వాళ్లు నేర్పిన అణకువ, ఆదరణ కొనసాగించాం. మా అమ్మానాన్న లు ఆకలిని చంపింద్రుగానీ అక్షరాన్ని చంపలేదు. వారు అందించిన అక్షరాలను ఆసరా గా చేసుకున్నాం. ఒకరు ఎక్సైజ్ శాఖలో సీఐగా, నలుగురం ఉపాధ్యాయులుగా ఎదిగాం. తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణను భావితరాలను అందించడమే మా కర్తవ్యం.

చిన్నతనంలో కష్టాలు..: చంద్రశేఖర్, సీఐ, ఎక్సైజ్ శాఖ



మా చిన్న తనంలో ఎన్నో కష్టాలు పడ్డాం. చదువుకోవాలనే ఆశయం ముందు ఎంత పెద్ద కష్టమైన చిన్నదిగా కనిపించేది. మా తల్లిదండ్రులు మా కోసం పడిన కష్టం చూసి అనేక సార్లు కన్నీళ్లు పెట్టుకున్నా. పెద్దాయ్యాక మా పిల్లలు ఎవరి ముందూ చేయి చాచకుండా ఉంటే చాలు అన్న మా అమ్మానాన్నల మాటలు ఇప్పటికి గుర్తుకొస్తాయి. ఒకప్పుడు మేమూ ఎందరినో సాయం కోరాం. ఇప్పుడూ ఇంకొకరికి సాయం చేసే స్థితిలో ఉన్నాం. మా అమ్మానాన్నలు ఆశించింది కూడా ఇదే.

పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి

● పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలని, స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరముందని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మశాలి సంక్షేమ ట్రస్టు భవనంలో రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయమన్నారు. స్వర్గీయ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు సేవలు మరువలేమన్నారు. మచ్చ ప్రభాకర్‌రావు పద్మశాలి శంఖారావం పేరుతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, వొళ్లా కృష్ణహరి, బోల్ల శివకుమార్, అవ్వారి భాస్కర్, బొమ్మ ప్రవళిక, బొమ్మ అమరేందర్, మార్త ప్రకాశ్, అంబటి శ్రీనివాస్, బొమ్మ రఘురాం, మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు, స్వర్గం మల్లేశం, పోలు సత్యనారాయణ, దూడం శ్రీనివాస్, గుడిమల్ల శ్రీకాంత్, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, లెక్కల వేణుగోపాల్, ఇప్పలపల్లి సాంబయ్య, అరకాల వీరేశలింగం, గడ్డం వెంకటేశం, దీకొండ లక్ష్మినారాయణ, ఒడ్నాల రవీందర్, జక్కని ప్రభాకర్, స్వర్గం నరసయ్య, మేముల చంద్రశేఖర్, ఎల్ల మహేశ్, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మానేరులో దూకి వ్యక్తి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులో దూకి ఇస్సాయిపేటకు చెందిన గుడ్లపల్లి ప్రకాష్ (55) ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఇస్సాయిపేటకు చెందిన గుడ్డపల్లి ప్రకాష్ కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రెండేళ్ల క్రితం కూతురు పెళ్లికి చేసిన అప్పు, తన భార్య అనారోగ్యానికి గురవగా ఆసుపత్రుల్లో చూపించేందుకు చేసిన అప్పు భారమయ్యాయి. అప్పుతీర్చే మార్గం లేక తరచూ కుటుంబ సభ్యులతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం ఇంటి నుంచి కూలీ పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం నర్మల మానేరు ఒడ్డున దుస్తులు చెప్పులు ఉండడతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనుమానంతో మానేరులో వెతకగా ప్రకాష్ మృతదేహం లభించింది. అప్పుల బాధతోనే తన భర్త మానేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య నాగలక్ష్మీ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

సుల్తానాబాద్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సుల్తా నాబాద్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్, ఎస్ఐ ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీకి చెందిన బండారి స్వాతి, వడ్డెర కాలనీకి శాంతినగర్‌కు చెందిన కోట స్వరూపలు గతంలో గుడుంబా విక్రయించగా వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని, నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ గుడుంబా విక్రయిస్తుండగా ఎస్ఐ రాజు, సిబ్బంది ఇద్దరిని అదుపులోకి తీసుకుని బుధవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎదుట హాజరుపరచగా వారిని రిమాండ్ తరలించాలని ఆదేశించారన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ గ్రామబస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన చెట్టుపల్లి అంజయ్య(52) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య బస్టాండ్ సమీపంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండంగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి కునుకుల అనిల్ కుమార్ అతివేగం అజాగ్రత్తతో వచ్చి అంజయ్యను ఢీకొట్టాడు. సంఘటనలో అంజయ్య తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు కోరుట్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గ మధ్యంలో అంజయ్య మృతి చెందాడు. మృతుడు అంజయ్య కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.

జ్వరంతో బాలుడి మృతి

కోరుట్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాడవేణి అశ్వద్ (11) అనే బాలుడు జ్వరంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాడవేణి రత్నాకర్-రాధ దంపతుల కుమారుడు అశ్వద్ కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అశ్వద్ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా స్థానికంగా ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. మంగళవారం పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అశ్వద్ తీవ్ర జ్వరంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ



మేడిపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మేడిపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మేడిపల్లి మండల కేంద్రంలో గొడవలు జరిగి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు కాగా గ్రామానికి డీఎస్పీ బుధవారం వచ్చి విచారణ చేశారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం జరిగిన జాతరలో యువకులు ఒకరిని ఒకరు తోసుకోవడంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారి తీసింది. దాంతో ఒకరిపై ఒకరు దాడికి పాలుపడ్డారు. అడ్డు వచ్చిన యువకుపై సైతం దాడి చేశారు. దాంతో కొంత మంది యువకులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గలవారిని శాంతింప చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.



చెట్టును ట్రాక్టర్‌లో తరలిస్తూ..





ఎక్స్‌కవేటర్ సహాయంతో ఇలా నాటుతూ..



తిరిగి ప్రాణం పోసుకున్న వృక్షాలు..

మహా వృక్షాలకు జీవం

రాయికల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఒక్కరి ఆలోచనకు గ్రామం అంతా ఏకమై వృక్షాల రక్షణకు శ్రీకారం చుట్టారు.. మొక్కలు నాటడమే కాదు ఏళ్ల నాటి నుంచి ప్రాణవాయువు అందిస్తున్న మహా వృక్షాలను కాపాడటం పర్యా వరణ పరిరక్షణ అని నమ్మారు.. ఒక చోట తొలగించిన వృక్షాలకు మరో చోట ప్రాణం పోసి కాపాడుతున్నారు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామస్థులు.

గ్రామస్థుల సహకారంతో...

పది సంవత్సరాలుగా గ్రామంలో పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలు నాటుతున్న తనకు వటా ఫౌండేషన్ స్ఫూర్తితో ట్రాన్స్ లోకేషన్ చేయాలనే ఆలోచన వచ్చింది. వృక్షాల రక్షణ అనే నా ఆలోచనకు గ్రామస్థులు సహకరించడంతోనే 13 వృక్షాలను మరో చోట నాటగా 11 వృక్షాలను కాపాడుకు న్నాం. ట్రాన్స్‌లోకేషన్ పద్ధతికి ఫైకాస్ జాతికి చెందిన రావి, జువ్వి, వేప, మామిడి, మారేడులాంటి వృక్షాలు అనువుగా ఉంటాయి. భారీ వృక్షాలను ఈ పద్ధతిలో నాటి మళ్లీ ప్రాణం పోయవచ్చు.




- సుంకిశాల సత్తయ్య, ఇటిక్యాల

వటా ఫౌండేషన్ స్ఫూర్తితో..

ఇటిక్యాల గ్రామానికి చెందిన సుంకి శాల సత్తయ్య అనే గీత కార్మికుడు హైదరాబాద్‌లోని వటా ఫౌండేషన్ స్ఫూర్తితో రహదారులు, భవనాల నిర్మాణంలో తొలగించే మహా వృక్షాలను ఇతర చోట నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్‌లో ఉద్యోగులు ప్రతీ ఆదివారం రోడ్ల పక్కన ఉన్న పెద్ద వృక్షాలను తొలగిస్తే వాటిని తిరిగి ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో నాటేవారు. ఇదే స్ఫూర్తితో గ్రామస్థులు, గంగాదేవి ఉద్యా నవన కమిటీ సహకారంతో గ్రామ శివారులోని మామిడి తోట ఆవరణలో సుమారు 15 నుంచి 18 ఏళ్ల రావి, జువ్వి ఇతర రకాల 13 చెట్లను తొలగిం చారు. వాటిని గ్రామంలోని పలు చోట్ల నాటి రెండు నెలల్లో 11 చెట్లకు ప్రాణం పోశారు. చెట్లను ఇతర ప్రాంతాలకు తరలించి నాటడానికి అయ్యే ఖర్చులు గ్రామస్థులు భరిస్తున్నారు. ఒక్కో వృక్షాన్ని తరలించి కాపాడటానికి సుమారు 2,500 రూపాయల వరకు ఖర్చు అవుతుండగా గ్రామానికి చెందిన ఏఎస్ ఎల్ పార్శిల్ వైస్‌ఛైర్మన్ హిమవంతరావు, గ్రామస్థులు భరించి వృక్షాలను కాపాడారు. మహా వృక్షాలను ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో తరలించి అనువైన చోట నాటడం ద్వారా పర్యావరణ రక్షణ సాధ్యమవుతుందని చాటుతున్నారు. జిల్లాలో జగిత్యాల-కరీంనగర్ రహ దారిలో ఏళ్ల నాటి వృక్షాలను ఇదే పద్ధతిలో ఇతర చోట్ల నాటాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కమిటీ సభ్యులు కోరారు. రాయికల్ అటవీ శాఖ అధికారులు పరిశీ లించి గ్రామస్థులను ఇటీవల అభినందించారు.



సత్తయ్య తిరిగి నాటిన వృక్షాలు



- సంగీత, సాహిత్యాల్లో దిట్ట
- పద్నాలుగు భాషల్లో ప్రావీణ్యం
- పదుల సంఖ్యలో అనువాదాలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రెండు భాషలు నేర్చుకోవడమే గగనమై పోతున్న ఈ రోజుల్లో పద్నాలుగు భాషలపై పట్టు సాధించడం సామాన్యమైన విషయం కాదు. అలాంటిది దేశంలోని విభిన్న సంస్కృతులపై అధ్యయనం ప్రారంభించి పలు భాషలపై పరిశోధన చేశారు. ఆ భాషల్లోని సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అనువాదాల రూపంలో అందించారు. ఆయా భాషల్లోని అంశాలతోనే ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. ఇప్పటి వరకు కవిత్వం, కథ, నవల అనువాదాలు కలిపి 33 పుస్తకాలకుపైగా వెలువరించారు. సైన్స్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ తెలుగు సాహిత్యం చదివి డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా ఎదిగి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు డాక్టర్ నలిమెల భాస్కర్. బహు భాషలు నేర్చుకోవడంతో పాటు సంగీతంపై ఎలా ఆసక్తి పెరిగిందో తన అంతరంగాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు..

బహు భాషల భాస్కరుడు

కొలనూరు రైల్వే స్టేషన్‌లో వివిధ పుస్తకాలు..

కొలనూరు గ్రామంలో 1979లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేశాను. ఆ సమయంలో ఖాళీ సమయం ఎక్కువగా ఉండేది. ఆ గ్రామానికి దినపత్రిక వచ్చేది కాదు.. లైబ్రరీ లేదు. ఇతర అలవాట్లు ఏమీ లేని నాకు పుస్తక పఠనమే ఇష్టమైన అభిరుచి. దీంతో కన్నడ భాష పుస్తకంపై అధ్యయనం మొదలుపెట్టాను. ఆ పుస్తకం పూర్తి చేశాను. అప్పటికే హిందీ, తమిళం, కన్నడ భాషలపై అవగాహన వచ్చింది. తర్వాత మిగతా భాషలపై దృష్టి సారించాను. కొలనూరు రైల్వే స్టేషన్‌లో చందమామ పుస్తకంతో పాటు అన్ని భాషా పుస్తకాలు, వివిధ భాషల్లో వచ్చే ఇండియా టుడే లభించేవి. వాటిని చదువుతూ భాషలపై పట్టు సాధించాను. ఈక్రమంలోనే ఎంఫిల్ చేయాలనిపించింది. ఏ అంశం మీద ఎంఫిల్ చేయాలనే ఆలోచన చేసినపుడు కొత్తపల్లి వీరభద్రారావు రాసిన 'తెలుగు పరిశోధనల భవిష్యత్ దర్శనం' పుస్తకంలోని ఒక వాక్యం నన్ను ఆకట్టుకున్నది.

'స్వాతంత్ర్యం రాక ముందు పాశ్చాత్యులు మన దేశం వచ్చి ఇక్కడి భాషలు నేర్చుకున్నారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతీయులెవరూ తమ మాతృభాష కాక ఇతర పొరుగు భాషలు నేర్చుకోవడం లేదు.' అన్న ఆయన మాటలు నన్ను ఆలోచింపజేశాయి. అప్పుడే నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీ సామెతల తులనాత్మక పరిశీలన' అనే అంశంపై ఎంఫిల్ పూర్తి చేశాను. ఆ తర్వాత బెంగాలి, అస్సామి, ఒరియా, గుజరాతి, పంజాబీ, ఉర్దూ, సంస్కృత భాషలను పదేళ్లలో పూర్తిగా నేర్చుకున్నాను. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగు మళయాల సామెతల్లో కుటుంబ జీవన చిత్రాలు' అనే అంశంపై పీహెచ్‌డీ చేశాను.

● బాల్యంలోనే హిందీపై ఆసక్తి

చిన్నప్పటి నుంచే ఇతర భాషలపై ఆసక్తి ఉండేది. మా ఊరిలో మేదరి రాజయ్య అనే వ్యక్తి హిందీ చాలా బాగా మాట్లాడేవాడు. నేను ఆయనతో మాట్లాడాలని ప్రయత్నించాను. తొమ్మిదో తరగతిలోకి వచ్చే సరికి హిందీ మాట్లాడడం వచ్చింది. రాజయ్య ఎప్పుడు కలిసినా హిందీలోనే మాట్లాడేవాడిని. మా ఉపాధ్యాయులు రామన్న, చక్రపాణి హిందీ చాలా బాగా చెప్పేవారు. దీంతో హిందీపై ఆసక్తి పెరిగింది. ఒకసారి కామారెడ్డికి వెళ్లినప్పుడు అంబటిపూడి రాసిన 'అరవం నేర్చుకోండి' అనే పుస్తకం కనిపించింది. నేను, నా స్నేహితుడు డి కిషన్ దానిని కొనుక్కొని బట్టీపట్టేశాం. దీంతో తమిళం మాట్లాడడం అలవాటైంది. రెండు భాషల్లో ప్రవేశం లభించడంతో ఇతర భాషలపై ఆసక్తి పెరిగింది. ఆ క్రమంలోనే 1977లో మరో స్నేహితుడు వేముల సత్యనారాయణతో కలిసి '30 రోజుల్లో కన్నడ భాష' అన్న పుస్తకం కొన్నాను. ఆ భాషనూ నేరుకున్నాను.



విభిన్న సంస్కృతుల అధ్యయనం

భారతీయ భాషలు నేర్చుకునే క్రమంలో 1990 ప్రాంతంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో వారం, పది రోజులు ఉండి అక్కడి సంస్కృతి, భాష, స్థానిక మాండలికాలను పరిశీలించాను. వివిధ రాష్ట్రాలకు వెళ్లినపుడు అక్కడి పుస్తకాలు తెచ్చుకున్నాను. ఇప్పటికీ తమిళ, మళయాళ, కన్నడ భాషల సాహిత్య పత్రికలు వస్తాయి. ఇటీవల గుజరాతీ భాషలో మహాత్మాగాంధీ ఆత్మకథ చదివాను. ఇష్టమైన సాహిత్యాన్ని ఆ మూల భాష ద్వారానే అధ్యయనం చేస్తాను.

మా ఊరు నారాయణపురంలో ఒక విద్యార్థి మీకు స్పానిష్ భాష వచ్చా అంకుల్ అని అడిగాడు.. రాదని చెప్పి దీని సంగతి తెలుసుకుందామని నేర్చుకోవడం ప్రారంభించాను. అది కొంత వంటబట్టింది. మా ప్రాంతం నుంచి చాలా మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్తారు. వాళ్ల కోసం అరబ్బీ, ఫ్రెంచి నేర్చుకుందా మనుకున్నాను కానీ ఆరోగ్యం సహకరించలేదు. అనంతరం అన్ని మూల భాషల్లోని కథలను తెలుగులోకి అనువదించాను. తెలుగు నుంచి ఇతర భాషల్లోకి కూడా అనువదించాను. మంద మరికొన్ని కథలు అనే పేరుతో కథల పుస్తకాన్ని వేశాను. అందులో అన్ని భాషల కథలు ఉన్నాయి. 2000 సంవత్సరం తర్వాత తెలంగాణ భాష అధ్యయనం చేసి తెలుగు భాషకు తెలంగాణ మూలమని పలు సభల్లో నొక్కి చెప్పాను. తెలంగాణ భాష దేశ్య పదాలు, తెలంగాణ భాష సంస్కృత పదాలు, తెలంగాణ భాష తమిళ పదాలు, తెలంగాణ భాష క్రియా పదాలు అనే పుస్తకాలు వెలువరించాను.



అ'విశ్రాంత' సాధకుడు

మా ఊరు నారాయణపురం.. అక్కడ ఎప్పుడూ ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమం జరిగేది. దీంతో నాకు సంగీతంపై ఆసక్తి పెరిగింది. మా ఇంటి ముందే నా సీనియర్ అయిన ఎల్ నారాయణ అనే వారు ఉండేవారు. ఆయన ద్వారా పాటలు, పద్యాలు నేర్చుకున్నాను. లవకుశ నాటకంలో లవుడి పాత్ర వేశాను. గొల్లపల్లిలో శారద నాట్య కళా మండలి వారి నాటకాలు చూశాను. కృష్ణ రాయబారం నాటకంలో కృష్ణుడి పాత్ర వేశాను. అప్పుడే హార్మోనియం వాయించడం నేర్చుకున్నాను. పాటలు పాడేవాణ్ణి. కానీ ఏ రాగమో తెలిసేది కాదు. 2011లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సంగీతం సాధన ప్రారంభించాలనుకున్నాను. కరీంనగర్‌లో ఉండే కేబీ శర్మ వద్ద 20 రోజులు సంగీతం పాఠాలు నేర్చుకున్నాను. ఆయన బిజీగా ఉండే వారు. ఆ తర్వాత నేను సమయం అక్కడ ఎక్కువ కేటాయించలేక యాను. ఏకా సుబ్బారావు రచించిన 'కొత్త సంగీత విద్యాదర్పణం' అనే పుస్తకం కొని చదివి పియానో కొనుక్కొని సంగీతం నేర్చుకున్నాను. నావద్ద ఒక పాత హార్మోనియం ఉండేది. దానిపై రాగయుక్తంగా పాడడం ఎలాగో సంవత్సరం పాటు రోజుకు ఆరుగంటలు సాధన చేశాను. దాంతో అనారోగ్యానికి గురయ్యాను. ఇప్పుడు ఇష్టమైన వేళల్లో సంగీత సాధన చేస్తున్నాను. మొత్తం 12 స్వరాలు నేర్చుకున్నాను. ప్రపంచంలోని అన్ని పాటలు కూడా ఈ స్వరాల్లోనే ఉంటాయి.. సంగీతం నేర్చుకోవడంతో నా బీఈడీ క్లాస్‌మెంట్ ఆర్ఎస్ వెంకటేశ్వర్‌రావు ప్రోత్సాహం ఉంది.దేశంలోని అన్ని భాషల పుస్తకాలు అధ్య యనం చేయడం ద్వారా భారతీయ సంస్కృతి, ఆచార వ్యవహారాలు అర్థమవుతాయి. ఏ పనిచేయాలన్నా నేర్చుకోవాలన్న ఉత్సాహం, సంకల్పం, పట్టుదల ఉండాలి. అందుకు తగిన సమయం కేటాయించాలి.

శాతవాహనకు రెగ్యులర్ వీసీ వచ్చేనా?

● ప్రారంభంకాని కొత్త కోర్సులు


శాతవాహన విశ్వవిద్యాలయం

గణేశ్‌నగర్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో సమస్యలు వీడడం లేదు. రెగ్యులర్ వీసీతో పాటు, అధ్యాపకుల కొరత, కొత్త కోర్సులు ప్రారం భం కాకపోవడంతో విద్యార్థులు నిరాశలో ఉన్నారు. బుధవారం ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంలను ప్రభుత్వం నియమించడంతో శాతవాహన యూనివర్సిటీకి కూడా రెగ్యులర్ వీసీ రావాలని విద్యాభిమానులు కోరుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలలో శాతవాహన యూనివర్సిటీ గత ప్రభుత్వంలో చాలా వెనుకబడింది. బడ్జెట్ విషయంలో కొత్త రెగ్యులర్ కోర్సులు, పోస్టుల మంజూరు విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందనే విమర్శలు ఉన్నాయి. 2008లో యూనివర్సిటీ ప్రారంభమైనప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీకి రెగ్యులర్ కోర్సులు ప్రాతిపదికన పోస్టులు మంజూరు చేసింది. యూనివర్సిటీకి 200 ఎకరాల భూమిని మంజూరు చేసింది. అప్పుడు ఉన్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ వీరారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి నూతన భవన నిర్మాణాలు, కొత్త కోర్సులకు ప్రతిపాదన తెచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత శాతవాహన యూనివర్సిటీలో ఒక కొత్త కోర్సు కూడా ప్రారంభించకపోవడం వల్ల విద్యార్థులు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత యూనివర్సిటీపై ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు కొత్త ఆశలతో ఉన్నారు. ఇప్పటికైనా మంత్రులు పొన్నంప్రభాకర్, శ్రీధర్‌బాబులు శాతవాహన విశ్వవిద్యాలయంపై దృష్టి సారించి యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించి కొత్త రెగ్యులర్ కోర్సులు, కొత్త పోస్టులు మంజూరు చేసే విధంగా చూడాలని మేధావులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు. బీసీని వీసీగా నియమించాలని బీసీ సంఘాలు, బీసీ విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

పురాతన ఆలయం పరిశీలన


సింగరాయగుట్టపై ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సైదాపూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ శివారులో గల సింగరాయ గుట్టపై గల పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఆలయం ప్రాముఖ్యత, ఆలయ అభివృద్ధిపై ప్రజలతో చర్చించారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆలయాన్ని సందర్శించి పరిశీలించామన్నారు. ఆలయ విశిష్టతను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, మాజీ ఎంపీపీ కామిని వీరేశం, సింగిల్‌విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, నాయకులు కూతురు విద్యాన్‌రెడ్డి, మునిగంటి సంతోష్, అనగోని శ్రీనివాస్, గోపగోని నవీన్, రమేష్, అశోక్, వెంకట్రాజం, సమ్మయ్య, రమేష్, పాల్గొన్నారు.

ఆలయ సమాచారం

ధర్మపురిలో కోజాగరి పౌర్ణమి వేడుకలు


పాలలో చంద్రుడిని వీక్షిస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కోజాగిరి పౌర్ణమి వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే విధంగా కోజాగిరి పౌర్ణమి సందర్భంగా స్థానిక లక్ష్మీనృసింహస్వామి దేవాలయం ప్రాంగణంలోని శేషప్ప కళా వేదిక వద్ద రాత్రి పాలలో చంద్రుడిని వీక్షించారు. రాత్రి వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారల చిత్రపటానికి విశేష పూజలు జరిపారు. భక్తులు అర్ధరాత్రి వేళలో పాలలో చంద్రుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొన్న శావపై శ్రీనివాసుడు

● పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు


స్వామివారి పొన్న శావకు స్వాగతం పలుకుతున్న భక్తులు

సిరిసిల్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి పొన్న శావపై భక్తులకు దర్శనమిచ్చాడు. సిరిసిల్లలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పొన్న వాహనంపై గోవిందుడు భక్తులకు దర్శనమిచ్చాడు. లక్ష్మీవేంకటేశ్వరస్వామి విశేష అలకంరణతో దేవస్థానం నుంచి బయలు దేరాడు. శావ ముందు భక్తులు గోవిందా నామ స్మరణలు మార్మోగాయి. మహిళలు అడుగడుగునా స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆడపడుచుల కోలాటం, దాండియా, చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు.

నేడు అంజన్న తలనీలాల టెండర్లు

● పదోసారి నిర్వహణకు ఏర్పాట్లు

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలానీలాలను పోగు చేసుకునేందుకు మరోసారి టెండర్లు గురువారం జరుగనున్నాయి. తగిన వేలం రావడం లేదని వాయిదా పడుతూ వస్తున్న టెండర్లు నిర్వహించడం ఇది పదోసారి. టెండర్ల నిర్వహణ కోసం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాట్లు చేయగా ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. కాగా గురువారం నిర్వహించే టెండరులో పాల్గొనడానికి ఐదు షెడ్యూల్స్ రాగా గతంలో సేకరించిన తలనీలాలలను కిలో చొప్పున అప్పగించేందుకు నిర్వహించిన టెండర్ కూడా రద్దు కావడంతో దానికి టెండరు జరుగనుంది.

సదర్‌మాట్‌పై ఆశలు

- చివరి దశకు బ్యారేజీ పనులు
- జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగునీరు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 16: గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 2017 జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. ఈ బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల జిల్లాలోని 4,896 ఎకరాలకు సాగునీరు అందనుంది. నిర్మల్, జగిత్యాల జిల్లా సరిహద్దుల్లో ఉన్న సదర్‌మాట్ పనులు గత ఏడాది పూర్తి కావాల్సి ఉన్నా వరదలు, నిధుల విడుదలలో జాప్యంతో ఆలస్యమయ్యాయి. బ్యారేజీ నిర్మాణంతో ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్, ఎర్దండి, మూల రాంపూర్, గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వం ఆ భూములకు నష్ట పరిహారం అందజేసింది.

● గంగనాల ప్రాజెక్టు మీదుగా..

సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణంలో జగిత్యాల జిల్లాలోని 4,896 ఎకరాలకు సాగునీరు అందతుంది. సదర్మాట్ బ్యారేజీ నుంచి వేములకుర్తి శివారులోని గంగానాల ప్రాజెక్టును నింపుతారు. అక్కడి నుంచి పంట పొలాలకు సాగునీరు అందించనున్నారు. ఈ ప్రాంత రైతులు యాసంగిలో సాగు నీరు అందక ఇబ్బంది పడేవారు. సదర్‌మాట్ బ్యారేజీతో ఆ ఇబ్బందులు తీరుతాయి. ప్రస్తుతం సదర్‌మాట్ గేట్లు తెరవడంతో చివరి ఆయకట్టు వరకు నీరందుతోంది. ఈ ప్రాంతం పచ్చని పొలాలతో కళకళలాడుతోంది.

● త్వరలో బ్యారేజీని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సదర్‌మాట్ బ్యారేజీని ఈ నెలాఖరు నాటికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు సమాచారం. రెండు జిల్లాల సరిహద్దులో నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే రెండు జిల్లాలకు చెందినవారు బ్యారేజీ సందర్శనకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సదర్‌మాట్ బ్యారేజీ

నెలాఖరులో ప్రారంభానికి ఏర్పాట్లు

- లక్ష్మి, సదర్‌మాట్ ఈఈ

సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయి. ఈ నెల చివరి నాటికి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. బ్యారేజీ నిర్మాణంతో 18 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తాం. బ్యారేజీతో ఎంతో ఉపయోగం.

రెజ్లింగ్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16 తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ క్రీడాకారులు మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన విజయ్‌కుమార్, సిద్ధార్థలు రజత పతకం కైవసం చేసుకున్నారు. బి నర్సింహ, కె రాజరథన్, ఎన్ దినేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన కె రాజు రజతం, కె అజయ్ కాంస్య పతకం, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన వి రఘుచరణ్ కాంస్య పతకం, ట్రినిటి జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్ ఆదిత్య మహరాజ్ కంస్య పతకం సాధించినట్లు టీం కోచ్ ఎం వంశీకృష్ణ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధుజాన్సన్‌లో అభినందించారు.


రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

రూ.6,950 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,950 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 57మంది రైతులు 368క్వింటాళ్ల విడి పత్తి, 12మంది రైతులు 17క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ట ధర రూ.6,950, కనిష్ఠ ధర రూ.6,300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక అక్టోబర్ 16: మండలంలోని ఇప్పలపల్లి చల్లూరు గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న మూడు టాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నవీన్,చల్లూరు గ్రామానికి చెందిన టాక్టర్ డ్రైవర్లు ఓనర్లు బోంగోని కూమార్,బోంగోని సదయ్యతూడి రాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

పశువులను కాపాడుకుందాం!

- ప్రమాదకరంగా గాలికుంటు వ్యాధి
- నెల రోజులపాటు టీకాల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం అమల్లో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ మంగళవారం ప్రారంభమైంది. పశువుల్లో గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరం. ఇది సూక్ష్మ క్రిములతో పాటు కలుషిత నీరు, ఆహారం, వాయు కాలుష్యం ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు టీకాల పంపిణీ కొనసాగనుంది. నూరుశాతం వ్యాక్సినేషన్ వేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీకా సామర్థ్యం ఆరు నెలలు.. ప్రతి ఆరు నెలకొకసారి అధికారులు మూగజీవాలకు టీకాలు వేస్తుంటారు. మూడు నెలల వయసు దాటిన ప్రతి ఆవు, గేదెలకు టీకాలు వేయనున్నారు.

● పనితీరుపై ప్రభావం

దేశవాళి కంటే ఎక్కువగా సంకరజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువ. దేశవాళి పశువుల్లో ప్రాణ నష్టం పెద్దగా లేకున్నా వ్యాధి తీవ్రత అధికం. టీకాలు వేయించకుంటే ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావం పడి పశువులకు తీవ్రంగా రొప్పు రావడం, పనిచేసే సామర్థ్యం తగ్గి, పాల ఉత్పత్తి పడిపోతుంది. ఓ దశలో చిన్న పశువులు అధిక ఉష్ణోగ్రతలతో మృతి చెందే ప్రమాదం ఉంటుంది. వ్యాధి భారినపడ్డాక వైద్యం చేయిచటం కంటే ముందే అప్రమత్తమై రైతులు పశువులకు టీకాలను వేయించాలి.



● లక్షణాలు ఇలా

పశువులు నడవకలేక పోవడం, దుక్కిటెడ్లు పనులు చేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి. 103 నుంచి 106 డిగ్రీల జ్వరం రావడం, నోట్లో, చిగుళ్లపై పొక్కులు వచ్చి మేత, నీరు తీసుకోలేవు. నోటి నుంచి చొంగకారడం, కాలు గిట్టెల్లో పుండ్లుపడి పురుగులు కనిపిస్తాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. దీనికి చికిత్స ఖర్చు ఎక్కువగా ఉంటుంది.

రైతులు టీకాలు తప్పక వేయించాలి

-పి. రవీందర్‌రెడ్డి, పశువైద్యాధికారి, సింగాపూర్



వర్షాకాలం కావడంతో పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. రైతులు నిర్లక్ష్యం చేయకుండా పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి. వ్యాధి రాకుండా రక్షణకు టీకాలు ఎంతో అవసరం.

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్

ముత్తారం, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో మంగళ, బుధవారాల్లో జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన లింగం శ్రీహన్స్ కార్తికేయ ఆర్చరీ విభాగంలో యూ-10 కాంపౌండ్ విభాగంలో అత్యధిక పాయింట్లతో గోల్డ్ మెడల్ సాధించాడు. కోచ్ డి. శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

జూలపల్లి, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో అర్థశాస్త్రం, హిందీ సబ్జెక్టులను బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ ఎండి షాదూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఆదర్శ పాఠశాలలో నిర్వహించే డెమో క్లాసుకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

సుల్తానాబాద్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలకు చెందిన బీటెక్ విద్యార్థిని అక్షితకు సుల్తానాబాద్‌కు చెందిన రిటైర్డు ప్రభుత్వ ప్రధాన ఉపాధ్యాయ దంపతులు అల్లం భాగ్యలక్ష్మి-సత్యనారాయణలు పదివేల రూపాయలు అందించారు. అక్షిత తండ్రి ఇరవై రోజుల క్రితం చనిపోగా, అంతకు ముందే తల్లి చనిపోయింది. అక్షిత మిర్యాలగూడ జేఎన్‌టీయూలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సాధించింది. ఆమె ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న భాగ్యలక్ష్మి, సత్యనారాయణలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తికి చెందిన రాధమ్మ ఇటీవల మృతిచెందగా, బుధవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆళ్ల సుమన్‌రెడ్డి, చీకట్ల మొండయ్య, రాజయ్య, రమేష్, బైరి రవి, తాళ్లపెల్లి సదయ్య, అల్లం సతీష్, గడ్డం బన్నీ, బొడకుంట చిన్న స్వామి, రంజిత్, వేల్పుల సదయ్య, తాళ్లపల్లి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ స్థలంపై కబ్జాదారుల కన్ను

- పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడమే కారణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మార్కెట్ యార్డులో కూలిన ప్రహరీ

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ స్థలం కబ్జాకు గురవుతోంది. పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆక్రమణలు జరుగుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని పాండవుల గుట్ట 597సర్వే నంబర్‌లో 1983లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మార్కెట్ సబ్ యార్డు కోసం 10ఎకరాల స్థలం కేటాయించారు. ఆ స్థలంలో ఓపెన్ గోదాం తోపాటు గోదాంను కూడా నిర్మించినా అప్పటి నుంచి మార్కెట్ యార్డ్ నిరుపయోగంగా ఉంది. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో వ్యవసాయ మార్కెట్ స్థలం వినియోగంలోకి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్ యార్డులో ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నది. గతంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా పని చేసిన ఇనగంటి వెంకటేశ్వరరావు హయాంలో మార్కెట్ యార్డుకు ప్రహరీని నిర్మించారు. గత ప్రభుత్వం సబ్ మార్కెట్ యార్డ్ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో వ్యవసాయ మార్కెట్‌కు మరో గోదాంతో పాటు, ఓపెన్ గోదాంను కూడా నిర్మించారు. వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించిన పది ఎకరాల స్థలం సరిపోకపోవడంతో అప్పటి కలెక్టర్ అలుగు వర్షిణి పక్కనే ఉన్న మరో నాలుగు ఎకరాలు కేటాయించారు. దీంతో వ్యవసాయ మార్కెట్‌కు మొత్తం 14ఎకరాల స్థలం సమకూరింది.అయితే పది ఎకరాల స్థలంలోనే ప్రహరీ ఉండగా, మిగతా నాలుగు ఎకరాలకు ప్రహరీ లేకపోవడంతో కబ్జాకు గురవుతోంది. అంతేకాక పాండవుల గుట్ట ప్రాంతమంతా విచ్చలవిడిగా ఎవరికి వారే కబ్జాకు పాల్పడుతున్నారు. ఈ విషయంపై చాలాకాలంగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రహరీ లేని కారణంగా కొందరు అనుమతులు లేకున్నా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, ఈ విషయంపై మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుల చేసినా స్పందన లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు వ్యవసాయ మార్కెట్లో నిర్మించిన ప్రహరీ సరిగాలేక సందులు ఏర్పడి వర్షం పడిన సమయంలో వరద వచ్చి ధాన్యం కొట్టుకపోతోందని రైతులు పేర్కొంటున్నారు. ప్రహరీ ఒకవైపు కూలిపోయి పశువులు మార్కెట్లోకి వస్తున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొత్తగా నలుగురు ఉపాధ్యాయులు ఎంపిక కాగా బుధవారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూ నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. జిన్న సతీష్ కుమార్ అంకంపల్లి, ఎస్ రాజమౌళి వెన్నంపల్లి, ప్రశాంత్‌రెడ్డి కాల్వశ్రీరాంపూర్‌లోని ఉన్నత పాఠశాలలో బాధ్యతలు స్వీకరించగా వారిని పీఆర్‌టీయూ అభినందించి సన్మానించింది. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ముంజాల హరికృష్ణగౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కూరెళ్ళ మల్లారెడ్డి, నాయకులు పులి శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి, రవికుమార్, గంధ శ్రీకాంత్ కూచయ్య, మోత్కూరి నారాయణ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

మంథని, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-24 ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన 12 మంది ఉపాధ్యాయులు పట్టణంలో, మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. పట్టణంలోని ఉర్దూ మీడియంలో ఎస్‌జీటీగా ఒక్కరు, ఉన్నత పాఠశాలలో వివిధ సబ్జెక్టుల్లో ముగ్గురు ఎస్ఏలుగా, మండలంలోని నాగెపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా ఒక్కరు, ఆరెంద జిల్లా పరిషత్ హెచ్ఎస్‌లో ఇద్దరు, అడవి సోమన్‌పల్లిలో యూపీఎస్‌లో ఇద్దరు ఎస్ఏలుగా, పోతారంలో యూపీఎస్‌లో ఇద్దరు ఎస్ఏలుగా, ఆక్కెపల్లిలో యూపీఎస్‌లో ఒక్కరు ఎస్ఏగా బుధవారం విధుల్లో చేరారు.

జిల్లాలో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తర్వాత జిల్లాలో నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. అదనపు కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 1, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3, మంథని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 4 నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి ఆ వివరాలను రాజకీయ పార్టీలకు తెలియజేసినట్లు తెలిపారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పు ప్రతిపాదనలు పంపామని అదనపు కలెక్టర్ తెలిపారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 3 పోలింగ్ కేంద్రాలు, మంథని నియోజకవర్గం పరిధిలో 3 పోలి కేంద్రాల పేర్ల మార్పు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. ఓటర్ జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులు దృష్టి సారించాలని, అక్టోబర్ 29న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేయడం జరుగుతుందని, దీనిపై అభ్యంతరాలను, నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను నవంబర్ 28 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 24 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ ప్రతినిధి పి.సంపత్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి శశి భూషణ్, కమ్యునిస్టు పార్టీ(మార్కిస్ట్) ప్రతినిధి సి. రవీందర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి యూ. రాజ్ కుమార్, తెలుగు దేశం పార్టీ ప్రతినిధి ఏ.మల్లారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్లలో అనస్థీషియా వైద్యులు కీలకం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోగులకు ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులు కీలకమని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా బుధవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోగులకు ఆపరేషన్ చేసిన తరువాత మత్తు నుంచి బయటకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ప్రొఫెసర్ భానులక్ష్మి, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విద్యుత్ విభాగంలో లైన్ ఇన్‌స్పెక్టర్ పనిచేసి బదిలీపై ధర్మారం మండలంలోని మల్లాపూర్‌కు వెళ్లిన దొమ్మటి రాజయ్యను మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో సంబంధిత విద్యుత్ అధికారులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజయ్య లైన్ ఇన్‌స్పెక్టర్‌గా మండలంలో రైతుల కరెంటు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, గృహాలలోని విద్యుత్ విషయంలో, తన విధులపై బాధ్యతగా చేశారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ మధుకర్, ఏఈలు శ్రీనివాస్, రాజమల్లు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కేశోరాం కార్మికులకు సన్మానం

పాలకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పనిచేసి పదవీ విరమణ, పదోన్నతి పొందిన పలువురు కార్మికులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, అధికారులు పి ప్రార్థసారథి, కర్రకంటి సదానందం, యూనియన్ ముఖ్య సలహాదారుడు బత్తిని సతీష్‌గౌడ్, తీగెల తిరుపతి, కండె స్వామి, శ్రీనివాస్, వెంకటేష్, బసవరాజును, కార్మికులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎలిగేడు, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురహాన్‌మియాపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీఏసీఎస్ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ గోడెల శ్రీనివాస్‌రెడ్డి(54) మంగళవారం పెద్దపల్లి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. బుధవారం ఆయన అంత్యక్రియల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. శ్రీనివాస్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

నియామకం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి మండల అధ్యక్షులుగా అందుగులపల్లికి చెందిన దామ సదయ్యను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తన నియమకానికి సహకరించిన పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ తదితరులకు సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ పాలకుర్తి మండల అధ్యక్షుడిగా కన్నాల గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్ పాషాను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్యను ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంఈవో చంద్రయ్యకు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, నాయకులు గొడిసెల ప్రణీత్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

అలాయ్ బలాయ్‌తో అసమానతలు దూరం : మేయర్



కార్యక్రమంలో అభివాదం చేస్తున్న నాయకులు

కోల్‌సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉన్న అసమానతలను దూరం చేయడంలో అలాయ్ బలాయ్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడుతా యని రామగుండం మేయర్ బంగి అనీల్‌కు మార్ పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని అడ్డగుంటపల్లిలో సామాజిక ఐక్య వేదిక ప్రతినిధి క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయ్ బలాయ్‌లో మేయర్ మాట్లాడారు. హైదరాబాద్‌లో బండారు దత్తాత్రేయ ప్రారంభించిన అలాయ్ బలాయ్ స్ఫూర్తితో గోదావరిఖనిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలంటే అసమానతలు దూరం కావాల్సి ఉందని, అలాయ్ బలాయ్‌లు ఇందుకు దోహపడుతాయన్నారు. బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అలాయ్ బలాయ్ ప్రధాన భూమిక పోషించిందని, ఎందరినో ఒక్కటి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ప్రతినిధి బొంకూరి మధు, మైస రాజేష్, బీజేపీ నాయకులు కోడూరి రమేష్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి నటరాజ్, ఆరె కెటిక సంఘం నాయకుడు రాము, బుడిగ జంగాల ప్రతినిధి సంపత్‌తో పాటు గొడిశెల రాజలింగం, దుబాసి బొందయ్య, బొల్లం మధు, నేతకాని శ్రీనివాస్, నవీన్‌గౌడ్, అందె రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా మొక్కల పెంపకం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను పెంచాలని ఏపీవో రమేష్‌బాబు అన్నారు. బుధవారం మండలం లోని కనగర్తి గ్రామంలో నర్సరీని పరిశీలించి మొక్కల రికార్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీవో రమేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు ఎండిపోతే వాటిని రిప్లేస్ చేస్తున్నామని, మొక్కలకు రక్షణగా ట్రీ గార్డులు, ముళ్ల పొదలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్యా, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

ట్రినిటీ కళాశాలలో ఓరియంటేషన్ డే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమి నార్ హాల్లో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్ హాజరై విద్యార్థులకు వారి భవిష్యత్తు గురించి వివరించారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడం కోసం వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ స్థాపించి గత 40 సంవత్సరాలుగా మారుమూల ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు సేవలంది స్తున్నారన్నారు. కార్యక్రమంలో విభాగ అధిపతి డాక్టర్ ఆరిఫ్, సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్ కౌశల్య, రామ్మోహన్ పాల్గొన్నారు.



స్థలాల లీజుకు టెండర్లు..

- పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు లీజుకు ఇచ్చేందుకు యాజమాన్యం నిర్ణయం
- ఖని బస్ డిపో పక్కన ఒకటి, పోతన కాలనీలో మరొకటి

గోదావరిఖని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలోని విలువైన ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు యాజమాన్యం నిర్ణయించింది. ముఖ్యంగా రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను వ్యాపార సంస్థల ఏర్పాటుకు లీజుకు ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా సింగరేణిలో పది చోట్ల పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. మందమర్రి, ఆర్‌జీ- 1, 2, 3, భూపాలపల్లి, మణుగూరు, కార్పొరేట్‌లలో ఈ స్థలాలను లీజుకు ఇవ్వనున్నారు. మందమర్రి ఎన్‌హెచ్-363లో మంచిర్యాల-చంద్రాపూర్ రహదారిలో 2,172 చదరపు గజాలు, మందమర్రిలో జాతీయ రహదారి పక్కన మూతపడిన 68వ డిప్ గని ఏరియాలో 3,617 చదరపు గజాల స్థలాన్ని లీజుకు కేటాయించనున్నారు. ఆర్‌జీ-1 పరిధిలో గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లోని రాజీవ్ రహదారిని ఆనుకుని ఆర్‌టీసీ డిపో పక్కన 2,488చదరపు గజాల స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నారు. ఈ స్థలం గురించి గతంలో జైళ్ల శాఖ, ఇతర ప్రైవేట్ వ్యక్తులు పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు సింగరేణికి అర్జీలు పెట్టారు. గజానికి రూ.70వేల నుంచి రూ.లక్ష విలువ ఉండే ఈ స్థలంలో వ్యాపార సంస్థలు ఏర్పాటు చేస్తామని కూడా పలు సంస్థలు కంపెనీకి దరఖాస్తు పెట్టుకున్నాయి. 2488 చదరపు గజాల ఈ స్థలం మార్కెట్‌లో రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లు ఉంటుందని అంచనా. దీంతో పాటు ఆర్‌జీ-2 పరిధిలోని పోతన కాలనీ రోడ్డులోని లక్ష్మీనగర్‌లో 1076చదరపు గజాలు, సెంటినరీకాలనీ రోడ్డులోని రెడ్డి కాలనీ వద్ద 1076చదరపు గజాలు, యైటింక్లయిన్‌కాలనీ షిర్కే క్వార్టర్ల వద్ద 748చదరపు గజాలు, ఆర్‌జీ-3 పరిధిలోని సెంటినరీ కాలనీ సీ-2 టైపు క్వార్టర్ల వద్ద 1555చదరపు గజాలు పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సంబంధిత సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదించారు. అలాగే భూపాలపల్లి కేటీకే-3ఇంక్లైన్ ఆర్చి వద్ద 2990చదరపు గజాలు, మణుగూరు పైలెట్‌కాలనీ వద్ద 2153చదరపు గజాలు, కార్పొరేట్‌లోని సంత ఏరియాలో 1797 చదరపు గజాలను లీజుకు ప్రతిపాదించారు. వివిధ ఆయిల్ కంపెనీలకు ఈ స్థలాలను కేటాయించనున్నారు. ఈ యాక్షన్ పద్ధతిలో ఈ స్థలాలను అప్పగిస్తారు. ఈ లీజులను 20 నుంచి 30ఏళ్ల పాటు ఇవ్వనున్నారు. ఆయిల్ కంపెనీల నుంచి డీలరు పొందిన వారు ఈ లీజును చెల్లించేలా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.

ఆర్జీ-3లో క్వార్టర్స్ కౌన్సెలింగ్

రామగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో పనిచేసే ఉద్యోగులకు బుధవారం క్వార్టర్స్ కేటాయింపు కౌన్సెలింగ్ చేపట్టారు. సెక్యూరిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కౌన్సెలింగ్‌లో 185ఖాళీ క్వార్టర్స్ ఫ్రెష్‌అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్‌కు 69 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 27మంది ఉద్యోగులు హాజరై 25 క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, సుదర్శనం, రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, డీపీఎం గుర్రం శ్రీహరి, రమ్య, సదయ్యలు పాల్గొన్నారు.

ఐక్యత పెంపొందించేందుకు 'బడాఖానా'

- కార్పొరేటర్ మహంకాళి స్వామి



కార్మికులకు భోజనం వడ్డిస్తున్న మహంకాళి స్వామి

గోదావరిఖని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల్లో ఐక్యతను పెంపొందించేందుకు, సంస్థపై అవగాహన, అంకితభావం పెంపొందించేందుకు బడాఖానా ఉపయోగపడుతుందని రామగుండం కార్పొరేటర్ మహంకాళి స్వామి అన్నారు. బుధవారం జీడీకే1 ఇంక్లైన్‌పై నిర్వహించిన బడాఖానా కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. సింగరేణి పరిరక్షణ, పురోభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు సంస్థలో నూతన గనులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రామగుండం శాసనసభ్యులు రాజ్‌ఠాకూర్, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ఈ ప్రాంతానికి రూ.400కోట్ల నిధులు తెచ్చారన్నారు. ఈ ప్రాంత నిధులను గతంలో సిద్దిపేట, గజ్వెల్, సిరిసిల్లా ప్రాంతాలకు తరలించుకుపోయేవారని, కానీ ఇప్పుడు ఇక్కడే వెచ్చిస్తున్నారన్నారు. రూ.20 కోట్లతో ఫిల్టర్‌బెడ్ నిర్మాణం, కార్మిక వాడల మధ్య అంతర్గత రోడ్లు ఏర్పాటు చేస్తున్నారని, భవిష్యత్‌లో సింగరేణి భాగస్వామ్యంతో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం, ఓసీపీ-4లో హైడల్ విద్యుత్ కేంద్రాలు రానున్నాయన్నారు. ఈప్రాంత పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి లభించేలా చూడాలన్నదే ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వన్ గ్రూప్ ఏజెంట్ రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి,మేనేజర్ రమేష్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, సంక్షేమాధికారి ఎక్బాల్ పాల్గొన్నారు.

సివిల్ డిపార్ట్‌మెంట్‌లో బడాఖానా

ఆర్‌జీ-1 పవర్‌హౌస్‌కాలనీలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో బడాఖానా నిర్వహించారు. ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర పేర జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేష్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు అధికారులు సహపంక్తి భోజనాలు చేసేలా బడాఖానా ఏర్పాటు చేసిందన్నారు. సింగ రేణి ఆసుపత్రుల్లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చొరవతో గుండె జబ్బులకు వైద్యం అందించేలా క్యాత్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వర ప్రసాద్, పోలు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, అనుమ సత్యనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉమేష్ సావర్కర్

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు బుధవారం ఆర్జీ-2 ఏరియాలోని సింగరేణి రెస్క్యూ ప్రధాన స్టేషన్‌లో ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(సౌత్ సెంట్రల్ జోన్) ఉమేష్ సావర్కర్ రెస్క్యూ జెం డాను ఆవిష్కరించారు. రెస్క్యూ సభ్యుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం డ్రాను తీసి పోటీలను ప్రారంభించారు. పాల్గొన్న ఆరు జట్లు రెస్క్యూ రిలే, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరీ, డ్రిల్‌అండ్ పెరేడ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. పోటీల్లో రెస్క్యూ జట్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోటీలను పారదర్శకంగా నిర్వహించనున్నామని, రెస్క్యూ సభ్యుల్లో నైపుణ్యత పెంచడం కోసం పోటీల ఉద్దేశమని చీఫ్ జడ్జి ఉమేష్ సావర్కర్ పేర్కొన్నారు. డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్, ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, జీఎం రెస్క్యూ శ్రీనివాసరెడ్డి, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ పీ శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి,డీజీఎంపర్సనల్ అనిల్‌కుమార్, రెస్క్యూ సూపరెండెంట్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-2ను సందర్శించిన డైరెక్టర్



ఓసీపీ-2 వ్యూపాయింట్ ద్వారా పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్

రామగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 ఓసీపీ-2ను డైరెక్టర్(పీ అండ్‌పీ)వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. ఓబీ కాంట్రాక్టు కంపెనీలు రోజువారి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అధికారులు రాజశేఖర్, ఐలయ్య, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభం

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారంలో ఇంకుడు గుంతల పనులను కాంట్రాక్టర్ కాజీపేట రాజేందర్ బుధవారం ప్రారంభించారు, సింగరేణి ఆర్‌జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఓపెన్‌కాస్ట్ వన్ ప్రాజెక్ట్ అధికారి రాధాకృష్ణలు గ్రామానికి ఇంకుడు గుంతలను మంజూరు చేయించారు. ఈ మేరకు గుండారం రిజర్వాయర్ సమీపంలో, హనుమాన్ దేవాలయం వద్ద, పెద్దమ్మ దేవాలయం వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర ప్రాంతాల్లో రూ.25 వేల నుంచి 30వేల వరకు ఖర్చుఅయ్యే ఇంకుడు గుంతలను మంజూరు చేయించారు. ఈ మేరకు సింగరేణి అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.